క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శుభా కాంక్షలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహేశ్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన నాయకులు



జనగామ: నియోజక కాంగ్రెస్ ముఖ్య నాయకులు శనివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం జనగామలో పార్టీ పరంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించినట్లు చెప్పారు. టీపీసీసీ, ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన వారిలో టీపీసీసీ మాజీ సెక్రెటరీ కంచ రాములు, మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్‌లు ఎర్ర మల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు సర్వాల నర్సింగరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త కరుణాకర్ రెడ్డి, సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

దేవరుప్పుల/జఫర్‌గఢ్: టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ వైద్యుల సెల్ జిల్లా అధ్యక్షుడు లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ గాంధీభవన్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు, బానోత్ భాస్కర్, మహేందర్, నరేష్ ఉన్నారు. అలాగే జఫర్‌గఢ్ మండలానికి చెందిన సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు ఆధ్వర్యంలో నాయకులు టీపీసీసీ చీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్సీని కలిసిన ముస్లింలు


జనగామ రూరల్: ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ నిర్మల్ పర్యటనలో భాగంగా శనివారం జనగామకు రాగా ముస్లిం నాయకుడు జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో అయనకు స్వాగతం పలికి సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వార్గల అభివృద్ధికి కృషిచేయాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. అనంతరం ఎస్సీ నాయకుడు తాటి కుమార్ ఇంటికి వెళ్లి నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఆర్థికసాయం



జఫర్‌గఢ్: కోనాయిచలం గ్రామానికి చెందిన సింగారపు రంజిత్ తండ్రి వీరస్వామి ఇటీవల మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న రంజిత్‌తో కలిసి చదువుకున్న 2006–07 టెన్త్ బ్యాచ్ స్నేహితులు రూ. 15 వేల సాయం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బాధిత కుటుంబానికి..



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన మహబూబాబాద్‌కు చెందిన గౌస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, ఆయన సేవలను గుర్తించిన లింగంపల్లికి చెందిన ఆకోజు పున్నంచందర్ బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు వాట్సాప్ ద్వారా రూ.21 వేల విరాళం సేకరించారు. ఆ మొత్తాన్ని శనివారం మహబూబాబాద్‌కు వెళ్లి అందజేశారు. మట్టరవి, టింటెల్ శ్రీను, అమర్ తదితరులు ఉన్నారు.

తల్లీ కూతురుకు కన్నీటి వీడ్కోలు

తరిగొప్పుల: కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లీకూతురు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడగా వారి పార్థివదేహాలు శనివారం మండలకేంద్రానికి చేరుకోగా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మండలకేంద్రానికి చెందిన సాంబారి రాజేశ్వర్ కుటుంబంతో కలిసి సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో నివసిస్తున్నాడు. రాజేశ్వర్ మద్యానికి బానిసై భార్య సాంబారి శారద(35)తో తరుచూ గొడవపడేవాడు. కాగా, భర్త ప్రవర్తనపై విసుగుచెందిన శారద కూతురు సాంబారి స్పందన(14)తో కలిసి గ్రామంలోని వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు మండలకేంద్రానికి తీసుకువచ్చారు. తల్లికూతురు మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు గ్రామస్తులు కన్నీటి పర్యంతం కాగా శనివారం అంత్యక్రియలు ముగిసాయి.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి



తరిగొప్పుల: మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వర్‌చారి

తరిగొప్పుల/నర్మెట/కొడకండ్ల/జఫర్‌గఢ్/దేవరుప్పుల/లింగాలఘణపురం: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, అందుకు గానూ అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని తహసీల్దార్ నాగేశ్వర్ చారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. మిల్లెట్ ప్రయోజనాలు, పెరటి కిచెన్ గార్డెన్, కిషోర బాలికల ఆహారాల జాగ్రత్తలపై వివరించామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సంఖ్యను పెంచాలని, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా లేదా ప్రతివారం చూడాలన్నారు. ఏసీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్ రంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అలాగే నర్మెట, కొడకండ్ల, జఫర్‌గఢ్, దేవరుప్పుల, లింగాలఘణపురం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాస కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో సీడీపీఓ రమాదేవి, వైద్యాధికారి విష్ణు, డాక్టర్లు హరికృష్ణ, రజినీకాంత్, స్నేహలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

27 నుంచి క్రీడాకారుల ఎంపిక

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 27, 28 తేదీల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు మండల నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శనివారం నిర్వహించిన మండల వ్యాయామ ఉపాధ్యాయుల (ఎస్‌జీఎఫ్) సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 నుంచి 17 సంవత్సరాల బాల బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో జిల్లా స్థాయి పోటీలకు గాను మండలస్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించాలన్నారు. 27న బాలురు, 28న బాలికలకు ఏర్పాటు చేయనున్న మండల స్థాయి క్రీడాకారుల ఎంపికను విజయవంతం చేయాలన్నారు. ఎస్‌జీఎఫ్ ఉపాధ్యాయులు మచ్చ రాజేందర్, మారపాక రాజయ్య, నీలం కుమార్, ఎండి ఖుద్దూస్, జి సోమన్న, చైతన్య, తిరుమల్, చందర్, మంజుల పాల్గొన్నారు.

గూడురులో..

పాలకుర్తి టౌన్: ఈనెల 27,28న మండలంలోని గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు బాలికల గురుకుల పాఠశాలలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు విద్యా శాఖ మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14,17 సంవత్సరాల లోపు విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి మామిండ్ల సోమయ్య, కన్వీనర్ కూటికంటి శ్రీనివాస్, పాఠశాలల పీడీలు చిట్యాల యాదగిరి, కోడిశాల అశోక్, అందె మంజుల పాల్గొన్నారు.

'వాటర్‌ప్లాంట్ మాకొద్దు'



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలోని ఐజల్ వాటర్ ప్లాంట్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈప్లాంట్ మాకు వద్దంటూ గ్రామస్తులు శనివారం ప్లాంట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఐజల్ ఏరియా మేనేజర్ విజయలక్ష్మి, ఐజల్ బాధ్యులతో గ్రామస్తులు ఈ విషయమై వాగ్వాదం చేశారు. గ్రామంలో ఐజల్ ప్లాంట్ వద్దని, అవసరమైతే మరో ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటామని, ఇందుకు సంబంధించిన లెక్కలు తేలేవరకు ప్లాంట్‌కు సంబంధించిన మిషనరీని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఉంచాలని కోరుతూ గ్రామస్తులు కార్యదర్శి జేసుమణికి వినతిపత్రం అందజేశారు. కాగా, ఈ విషయమై ఐజల్ ఏరియా మేనేజర్‌ను వివరణ కోరగా గ్రామస్తులు కమిటీ ఏర్పాటు చేసుకుని ప్లాంట్‌ను నడిపిస్తే బాగుంటుందని, విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పి.రాజిరెడ్డి, యా.దినేష్, కోల తిరుపతి, దాసి రాజు, ఓరుగంటి రమేష్, జి.చంద్రమౌళి, కృష్ణారెడ్డి, సురేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ధర్మభిక్షం

బచ్చన్నపేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే విద్యార్థి మహాగర్జనకు వేలాదిగా విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, నాయకులు సుమ, మురళి, దీన, నివేదన, నిఖిల్, ఆనంద్, చిన్మయి, రేఖ, శ్రీవిద్య, హారిక, కావ్య, స్రవంతి, విజయ్, సందీప్, భాను పాల్గొన్నారు.

ప్రత్యేక జీపీ చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న తండా వాసులు

పాలకుర్తి: పాలకుర్తి మండలం అయ్యంగారిపల్లి పరిధిలో ఉన్న ఎల్లమ్మగడ్డ తండాతో చుట్టుపక్కల తండాలను కలిపి ప్రత్యేక గ్రామ పంచాయతీ చేయాలని తండా వాసులు కోరారు. పాలకుర్తిలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బమ్మెర జీపీ పరిధిలో ఉన్న తండాలను అయ్యంగారిపల్లిలో చేర్చడంతో సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఎల్లమ్మగడ్డ తండాతో పాటు ఇతర తండాలను కలిపి ప్రత్యేక గ్రామపంచాయతీగా చేయాలని కోరారు. ఒక వేళ ప్రత్యేక జీపీ చేయకపోతే బమ్మెర గ్రామ పంచాయతీలో కలపాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ రవీందర్‌కు వినతి పత్రాలను వారు అందజేశారు. లూనావత్ సునీల్, బాణావత్ రమేష్, బొజ్జ బిక్కు, సోమల, రమేశ్, శంకర్, దామోదర్, చిరంజీవి, శ్రీను పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



జెండా ఆవిష్కరణలో కనకారెడ్డి తదితరులు

బచ్చన్నపేట: బ్యాంకుల్లో పంట రుణాలను తీసుకున్న అన్నదాతలకు అందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కోరారు. మండలంలోని లింగంపల్లి గ్రామంలో శనివారం సీపీఎం మహా సభలను బడెంగల బాలరాజు అధ్యక్షతన నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను విస్మరించే ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సభలో గ్రామ శాఖ మహిళా కార్యదర్శిగా మన్నె లక్ష్మి కల్పన, మరో శాఖ కార్యదర్శిగా బలరాములులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేష్, మిన్నాలపురం ఎల్లయ్య, బాల్‌నారాయణ, వెంకటవ్వ, రాములు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



కూతురుతో భర్త ఇంటి ఎదుట బైఠాయించిన సంధ్య

తరిగొప్పుల: తనను కాపురానికి తీసుకుపోవడంలేదని వివాహిత కూతురుతో కలిసి భర్త ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. ఈ సంఘటన శనివారం మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి సంధ్యకు అదే గ్రామానికి చెందిన పురుమాని సంపత్‌కు 2014లో సంవత్సరంలో వివాహం జరగగా వివాహమైన ఏడాదిలోనే కూతురు జన్మించింది. కాగా, వరకట్నం విషయంలో భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో సంధ్య పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినప్పటికీ భార్యభర్తల గొడవ సద్దుమనగలేదు. ఇటీవల సంపత్ వేరే మహిళను వివాహం చేసుకున్నాడని తెలియడంతో సంధ్య కూతురుతో కలసి భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. తనకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేసింది.

పట్టణంలో 'స్వచ్ఛతా హీ సేవ'



జనగామ: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, చర్చి ఏరియాలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 20వ వార్డు ఆఫీసర్ మల్లిగారి మధు ఆధ్వర్యంలో కమిషనర్ వెంకటేశ్వర్లు స్వచ్ఛతపై ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తడి, పొడిచెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనం వచ్చిన సమయంలో ఇవ్వాలని, రహదారులపై వేసి అపరిశుభ్రంగా మార్చవద్దన్నారు. ప్రమాదకరమైన ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించాలని పిలుపునిచ్చారు.

నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు విశిష్ట పురస్కారం

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు(ఆదివారం) ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు ప్రోగ్రాం చైర్మన్ ఇటికాల వీరయ్య శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం పురస్కరించుకుని ఈ అవార్డులను అందించనున్నట్లు తెలిపారు.

26న ఐలమ్మ జయంతి

పట్టణంలోని రజకవాడలో ఈ నెల 26వ తేదీన చిట్యాల ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా ఉల్లెంగుల రాజు, సభ్యులుగా ఉల్లెంగుల శ్రీనివాస్, శ్రీనివాస్, కొలిపాక నర్సింహులు, ఉల్లెంగుల రామకృష్ణ, ఏదునూరి సారయ్య, శంకర్, రాజులను ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల మాతృవందనం



లింగాలఘణపురం: మండలంలోని నవాబుపేట ఉన్నత పాఠశాలలో శనివారం మాతృవందనం కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థుల్లో మాతృభావన పెంపొందించేందుకు 7వ తరగతిలో ఉన్న 'అమ్మ జ్ఞాపకాలు' అనే పాఠ్యాంశాన్ని ఆధారంగా అమ్మమ్మ, నాయనమ్మల పాదాలను కడిగించి ఆ నీటిని తలపై చల్లుకోవడమే కాకుండా వారికి పాదాభివందనం చేశారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీరు అందించేందుకు గేట్ల ఎత్తివేత

నర్మెట: వరిచేలు పొట్టదశలో ఉన్నదున సాగునీరు అందించాలని మండకేంద్రం రైతులు కోరడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి విషయాన్ని జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తెలిపారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు తెలుపడంతో వెల్దండ రిజర్వాయర్ గేట్లను శనివారం ఎత్తి నీటిని విడుదల చేశారు. డ్యాం ఇన్‌చార్జ్‌లు నిమ్మన బోయిన మల్లేషం, సురేష్, శ్రీధర్, రాజేష్, రాజు, మహేష్, సంగి మల్లేష్ పాల్గొన్నారు.

అన్నదానం

జనగామ: పట్టణ కాంగ్రెస్ యువజన నాయకుడు వేమళ్ల అభిలాష్‌రెడ్డి, శ్వేతారెడ్డి దంపతుల కుమారుడు శ్రేయాష్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని శనివారం పవన్ కల్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో స్థానిక వర్ధన్ ఆశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. పాముకుంట్ల మణిదీప్‌గౌడ్, జోగు భాస్కర్, సాయి శివ, గుజ్జుల నాలిన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో పలువురి చేరిక

జనగామ రూరల్: పట్టణంలోని నాగులకుంటకు చెందిన చిలుకూరి మణిరత్నంతో పాటు 10 మంది యువకులు సీపీఎం పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి వారికి కండువా కప్పి ఆహ్వానించారు. పాము కృష్ణమూర్తి, బొట్ల శ్రావన్, బాల్య వెంకటమల్లయ్య, కళ్యాణలింగం పాల్గొన్నారు.

ఆంగ్లంలోనూ పట్టు సాధించాలి

దేవరుప్పుల: మాతృభాషతోపాటు ఆంగ్లంలోనూ పట్టు సాధించినప్పుడే ఉన్నత విద్యలో రాణించగలుగుతారని ఫెరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త కర్రె మల్లేషం సూచించారు. మండలంలోని పెద్దమడూరు హైస్కూల్ విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ జోగు భిక్షపతి స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలను సమకూర్చగా ఆయన పంపిణీ చేశారు.

బీఎల్‌ఓలకు కిట్ల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: బూత్ లెవల్ అధికారుల కోసం కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన బీఎల్‌ఓ కిట్లను స్థానిక తహసీల్దార్‌లో వారికి శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. డీటీ సంధ్యారాణి, బీఎల్‌ఓల సూపర్‌వైజర్లు రవీందర్, సతీష్, సత్యనారాయణ, దేవేందర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసమే 'పొలంబాట'

జనగామ: వ్యవసాయ పొలాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో పొలంబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వే ణుమాధవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పొలంబాటలో లూజ్ లైన్లతో పాటు వంగిన విద్యుత్ స్తంభాలు, అదనపు పోల్స్, తదితర సమస్యలను గుర్తించడం జరుగుతుందన్నారు. రైతులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిన వెంటనే రైతులు 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కరెంటు సమస్య ఏర్పడిన సమయంలో సొంత ప్రయోగాలు చేసుకుని, ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా అధికారులకు సమాచారం అందించి, వారు వచ్చే వరకు వేచి చూడాలన్నారు.

అవగాహనే మాక్ పోలింగ్ లక్ష్యం



మాక్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు స్లిప్‌లతో బారులుదీరిన విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటుహక్కు ప్రాముఖ్యత, ఎన్నికల విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు హెచ్‌ఎం, మండల నోడల్ అధికారి కొమురయ్య తెలిపారు. మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌లో పాఠశాల సాంఘీకశాస్త్రం ఉపాధ్యాయులు ఓరుగంటి పరమేశ్వరి, పిల్లమారి రఘుపతి ఆధ్వర్యంలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం, మండల విద్యాశాఖ నోడల్ అధికారి కొమురయ్య పర్యవేక్షణలో నిర్వహించిన మాక్ పోలింగ్‌ను సాధారణ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా నిర్వహించారు. రిటర్నింగ్ అధికారిగా కె.తేజస్విని, ఎన్నికల అధికారిగా వి.శ్రీకాంత్ వ్యవహరించారు. మొత్తం 149 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొనగా విద్యార్థి చైతన్యకు 18 ఓట్లు, శ్రీగణేష్‌కు 86, స్పందనకు 24, కీర్తిప్రియకు 17, నోటాకు రెండు ఓట్లు రాగా రెండు ఓట్లు రిజెక్టు అయ్యాయి. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రజాస్వామ్యదేశంలో ఓటుహక్కు ఎంతో విలువైందని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సక్రమంగా వినియోగించుకుని భవిష్యత్ తరాలకు మంచి సమాజాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.అంజిరెడ్డి, రాజేంద్రప్రసాద్, పరమేశ్వరి, కొల్లూరి ప్రకాశం, పి.రఘుపతి, శ్రీనివాస్, రంజిత్‌కుమార్, విజయకుమారి, లలితకుమారి, వెంకటేష్, శాంతి, వెంకటేశ్వర్లు, దేవేందర్‌కౌర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సంఘం పోరాట ఫలితమే విశ్రాంతి భవనం



మార్కెట్‌లో ఏర్పాటు చేసిన తాగునీటిని పరిశీలిస్తున్న నాయకులు

జనగామ రూరల్: రైతు సంఘం పోరాట ఫలిత మే వ్యవసాయ మార్కెట్‌లో విశ్రాంతి భవనం, తాగునీరు, తదితర వసతులు కల్పించారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్కెట్‌కు వస్తున్న రైతులకు, ప్రజలకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని రైతు సంఘం పోరాటం చేసి అధికా రుల దృష్టికి తీసుకెళ్లడంతోనే విశ్రాంతిభవనం ఏర్పాటు చేశారన్నారు. అధికారులు స్పందించి సౌకర్యాలు ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. రైతు సంఘం నాయకులు మీ ట్యానాయక్, మంగ బీరయ్య, కనకయ్య , రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



పాలకుర్తి టౌన్: లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

పాలకుర్తి టౌన్/జఫర్‌గఢ్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన త్యాగాలు మరువలేనివని, అందరికి ఆదర్శమని గూడూరు చేనేత సహకార సంఘం చైర్మన్ రచ్చ కృష్ణమూర్తి, లక్ష్మణ్ బాపూజీ విగ్రహప్రతిష్ఠ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారుపు సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో కొండాలక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానకి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు చిలుకమారి వెంకటేశ్వర్లు, మార్కెండయ్య, రమేశ్, వెంకటేశ్వర్లు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే జఫర్‌గఢ్ మండల కేంద్రంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షు మామిడాల సోమనారాయణ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బా పూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు, అంజయ్య, ప్రభాకర్, అనిల్, యాదగిరి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ధరంసింగ్‌నాయక్, తదితరులు

రఘునాథపల్లి: మహిళలు బ్యాంకుల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మెనేజర్ ధరంసింగ్‌నాయక్ అన్నారు. మండలంలోని కోమల్ల రైతు వేదికలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం మహిళా సంఘాలకు ఆర్థిక అక్షరాస్యత, కస్టమర్‌కేర్, క్రెడిట్ క్యాంపు కార్యక్రమాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రీజనల్ మెనేజర్ కృష్ణమోహన్, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఎల్‌డీఎం శ్రీధర్, బ్యాంక్ మెనేజర్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ వేణు, ఏపీఎం సారయ్య, సీసీలు సంపత్, రీనావతి, వీఓ అధ్యక్షురాలు లలిత, వీఓఏలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిన్నారులకు వైద్యపరీక్షలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ సెంటర్లకు చెందిన చిన్నారులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఘన్‌పూర్ 3వ అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జనార్దన్‌రెడ్డి, చిల్డ్రన్ స్పెషలిస్టు డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఫ్లోరెన్స్ మాట్లాడారు.

రూ . 2 లక్షలు పలికిన లడ్డూ



రఘునాథపల్లి: మండల కేంద్రంలోని బ్యాంక్ స్ట్రీట్‌లో గణపతి నవరాత్రుల్లో పూజలందుకున్న గణనాథుడి లడ్డూకు శనివారం రాత్రి వేలం వేశారు. మండల కేంద్రానికి చెందిన కోళ్ల సాయిదుర్గ రూ. 2,00,016కు స్వామివారి లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం గణేశ్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు.

వైభవంగా వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా వార కల్యాణం నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన నాళం సుజాత–నాగార్జున, రాగమని దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు.

కెనాల్‌కు గండి..వృథాగా పోతున్న నీరు

రఘునాథపల్లి: అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి చీటకోడూర్ రిజర్వాయర్‌కు వెళ్లే కెనాల్‌కు గండి పడి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. ఖిలాషాపూర్–లక్ష్మితండా మధ్య కెనాల్‌లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి వారం రోజుల క్రితం కెనాల్‌కు గండిపడింది. వృథాగా నీరు పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సమీప రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కెనాల్ గండి పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

జఫర్‌గఢ్: విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం తోడ్పడాలని నోడల్ అధికారి ఎండీ పర్వేజ్ కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ కందూరు సుధాకర్‌రెడ్డిని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

రఘునాథపల్లి: గబ్బెట ప్రాథమిక పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించా రు. 40 రకాల వంటలు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునంద మాట్లాడారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చిల్పూరు: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని హెచ్‌ఎం సరోజ అన్నారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే పిల్లలపై తాము ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో అలాగే తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద అంతే శ్రద్ధ వహించాలన్నారు. ఇంటివద్ద పిల్లలకు ఎక్కువ సేపు సెల్‌ఫోన్ ఇవ్వొద్దన్నారు. ఉపాధ్యాయులు ఫాతిమారాణి, రమేశ్, స్వర్ణలత, హరిప్రసాద్, రూప్లానాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన ఆరో తరగతి విద్యార్థి మోటె భరత్ (11) ఈ నెల 17న నెల్లుట్లలో సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో జరిగిన సమయంలో కారు ఆపకుండా వెళ్లడంతో పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.